# అతకని బ్రతుకులు

= = రచన: శ్రీ దివాకర్ల సన్యాసిరాజు. = =

ధన్‌మని పిడుగు పడిందెక్కడో. కళ్ళు మిరుమిట్లుగొలిపేలా జిగేల్‌మని ఒక్క మెరుపు మెరిసింది. పెద్ద ఫ్లాష్‌లైట్ కెమెరాతో భూమండలాన్ని ఫోటో తీసినట్లయింది. జుయ్యి-మని రొజ్జు గాలి, హోరున వర్షం ప్రకృతంతా భీభత్సంగా తయారయింది. ఆకలిగొన్న సింహంలా గర్జిస్తోంది ఆకాశం.

గాఢనిద్రలో ఉన్న పిల్లలు తుళుక్కుపడి తల్లి హృదయానికి కరుచుకుపోయారు. పగలంతా శ్రమించి, వళ్ళు వోడ్చి పనిచేసిన కష్టజీవులు, బుఱ్ఱలు బద్దలు చేసుకొని ఉదయంనుండీ సాయంకాలంవరకూ ఆఫీసు ఫైళ్ళతో కుస్తీపట్టి అలసిపోయిన గుమస్తాలు, హాయిగా ముసుగు తన్ని నిశ్చింతగా నిద్రాదేవి ఒడిలో అలసట తీర్చుకుంటున్నారు.

చేతిలో నున్న కవరు హృదయానికి హత్తుకొని పైట కొంగు దానిమీద తడిసిపోకుండా కప్పి, రోడ్డుమీద పారుతున్న బురద నీటిలో తపతప నడుస్తోంది శారద. శారద పూర్తిగా తడిసిపోయింది. చీర వంటికి అంటుకుపోయింది. కవరు తడవకుండా విశ్వప్రయత్నం చేస్తోంది. ఈ భీభత్సంగా ఉన్న వాతావరణం ఆమెనుమాత్రం భీతి గొల్పలేకపోయింది. ఆమె హృదయాంతరాళంలో జరుగుతున్న భయంకర సంగ్రామానికి ప్రతిబింబంగా ఉంది పై వాతావరణం. బ్రతుకుమీద ఆశ లేదు. జీవితంపై తీపిలేదు, దేనిమీదా మమత లేదు. ఆమె ఆఖరి ఆశయం ఒక్కటే-అది తన చేతిలోనున్న కవరు శేఖర్‌కి అందజేయాలి. తరవాత తనేమైనా చింత లేదు.

ఆ కవరు శేఖర్ చేతిలోపడితే ఆమె బరువు తగ్గుతుంది. ఆమె హృదయంలో చెలరేగిన తుఫాను శాశ్వతంగా సద్దుమణిగిపోతుంది.

అమావాస్య చీకటి, వర్షం తీవ్రరూపం దాల్చింది. గాలి తాకిడెక్కువైంది. ఒక యింటి పంచలో గోడకు అంటుకుపోయిన ఊరకుక్క 'కుయ్యో' మని మూగింది.

శారద నడుస్తోంది. చీర తడిసి అడుగు వేగంగా పడకుండా అడ్డొస్తోంది.

నీరు కారుతున్న ముంగురులను పైకితోసి ముందుకు చూసింది శారద. అదేయిల్లు-దగ్గరకొచ్చింది, వళ్ళు జలదరించింది, టపటప కొట్టుకుంది హృదయం.

ఒక గదిలో లైటు వెలుగుతోంది. తలుపులు వేసి ఉన్నాయి. ఒక కిటికీ రెక్క మాత్రం తెరుచుకొని వుంది. పైకి ప్రసరిస్తున్న మెర్క్యురీ లైటు కాంతిలో వర్షపుధారలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శారద నెమ్మదిగా గుమ్మంలో అడుగుపెట్టింది. కిటికీదగ్గరకి చేరి లోపలకు చూసిన శారద ఒక్కక్షణం స్థంభించిపోయింది.

శేఖర్ కుర్చీలో కూర్చొని టేబుల్‌పై ఒరిగి ఉన్నాడు. ఎదురుగా శారదఫోటో టేబుల్ మీద వుంది.

''టంగ్ ...టంగ్ ...'' రెండు గంటలు కొట్టింది గడియారం. 'అబ్బ!! యింతరాత్రయినా శేఖర్ పడుకోలేదా! అవును ఎలా పడుకుంటాడు, అతనికి నిద్రరాదు. ఎంత బాధపడుతున్నాడో! ఆస్తిపోయి, ప్రేమించిన యువతి పరుల సొత్తయితే ఎవరు నిశ్చింతగా నిద్రపోగలరు? శేఖర్ ఈ స్థితికి రావడానికి కారణం తను, అతని ఆస్తి పోవడానికి కారణం తను, అతన్ని జీవచ్ఛవంలా చేసిందితను, ఛీ! ఎందుకీ పాడుబ్రతుకు.

శారద హృదయం తరుక్కుపోయింది. దుఃఖం పొంగిపొర్లింది. వెంటనే పైటకొంగు నోట్లో కుక్కుకొని కుమిలిపోయింది. కళ్ళవెంట ధారాపాతంగా కారిపోతున్న కన్నీరు వర్షపునీటితో కలిసిపోయింది.

హృదయానికి అంటుకుపోయిన కవరు తీసి కిటికీలోంచి లోపలకు జారవిడిచింది.

'భగవాన్! మరో జన్మ అంటూవుంటే శేఖర్ భార్యగా అయ్యేట్టు చెయ్యి! అనుకుంది శారద కళ్ళు తుడుచుకుంటూ మరోసారి గదిలోకి చూసి, వెనక్కి తిరిగి పరుగెత్తి చీకట్లో కలిసిపోయింది.

శేఖర్ కళ్ళవెంట కారిన నీరు ఎండిపోయి చారలు కట్టింది. నిద్ర లేకపోవడంచేత కళ్లు ఎర్రగా ఉన్నాయి. సంస్కార రహితమైన తల, మాసిన గడ్డం శేఖర్ పడుతున్న బాధను వ్యక్తం చేస్తున్నాయి.

టేబుల్ పైనుండీ తలెత్తాడు శేఖర్. ఎదురుగా చిరునవ్వుతో అందమైన కళ్ళతో కనిపించింది శారదరూపం.

"శారదా! నన్నెందుకు నిరాకరించావు? నా కెందుకింత అన్యాయం చేశావు? నా హృదయాన్ని బద్దలు చేశావు. చితికి ముక్కలైన ఈ హృదయాన్ని చూసి ఆనందిద్దామన్నా! నేనేం అపకారం చేశాను శారదా నీకు? నిన్ను మనస్పూర్తిగా ప్రేమించానే, నా ప్రాణప్రదంగా చూసుకున్నానే నీకోసం, నీ సాన్నిధ్యం కోసం. యింగండు వెళ్ళిన రెండు సంవత్సరాలూ రెండు క్షణాల్లా గడిపానే, నన్నెందుకు కాదన్నావు శారదా! నా ఆస్తిని ఐశ్వర్యాన్ని చూసి నన్ను ప్రేమించావా! ఆస్తి పోగానే నువ్వు పోయావా? అవును! నా డబ్బుని చూసి నన్ను ప్రేమించావు. సాధారణ కుటుంబం నీది. నువ్వు మా దగ్గర పనిచేసే టైపిస్టువి, నీ ఆదాయంమీద మీ కుటుంబం ఆధారపడి ఉంది. నా డబ్బుని చూసి నన్ను వల్లో వేసుకున్నావు. అమృతం చిందేలా మాట్లాడావు. నేనే నీ సర్వస్వం అన్నావు. పెళ్ళి చేసుకుంటే నన్నే తప్ప మరెవర్నీ చేసుకోనన్నావు. నువ్వు తేనె పూసిన కత్తివని తెలుసుకోలేక పోయాను.

నీలో ప్రవహించేది రక్తంకాదు, స్వార్థం. నువ్వు ధన పిశాచివి, నీకు కావలసింది డబ్బు. నీలో మానాభిమానాలు, ప్రేమానురాగాలు మచ్చుకయినా లేవు. పాతకీ! నా బ్రతుకు నాశనం చేసి స్వర్గసుఖాలు అనుభవిద్దామనుకున్నావా? నీలాంటి వంచకురాల్ని ఆనాడే పీక పిసికి చంపేయవలసింది, నువ్వు బ్రతికుంటే యింకా ఎంతమంది జీవితాలతో చెలగాట మాడతావో, నిన్నేం చేసినా పాపం లేదు"-

శేఖర్లో ఉద్రేకావేశా లెక్కువయ్యాయి. అసలే ఎర్రగాఉన్న కళ్లు నిప్పుకణాల్లా మెరుస్తున్నాయి. కోపంతో ఫోటో తీసి నేలకేసి కొట్టాడు.

విరిగిన గాజుముక్కల మధ్య నవ్వుతున్న శారద రూపం కనపడింది.

'ఛీ...అని ఆ ఫోటో అందుకొని ముక్కలు ముక్కలుగా చించి కిటికీలోంచి పైకి విసిరేశాడు.

వెనక్కి తిరిగిన శేఖర్ కాలికి కవరు తగిలింది.

వంగి కవరుతీశాడు ఆశ్చర్యపోతూ;

బరువైన పొడుగాటి కవరుమీద 'శేఖర్ గారికి' అని ఉంది. కూర్చొని కవరు విప్పాడు శేఖర్.

నాలుగరటావు కాగితాల ఉత్తరం, ఒక వీలునామా ఉన్నాయందులో.

గబగబా కాగితాలు మడత విప్పి చదవసాగాడు.

"శేఖర్,

దయచేసి చదవకుండా చింపేయకండి, మీరు చాలా బాధపడుతున్నారని తెలుసు. నేను అసహాయురాలిని శేఖర్, నేను మీకు ఏం చెప్పినా మీకర్థంకాదు. నన్ను పూర్తిగా అర్థంచేసుకోకుండా ఆవేశపడ్డారు ఆరోజు. నన్ను క్షమించు శేఖర్, మీకు తీరని అన్యాయం చేశాను. పరిస్తితులకు బానిసనయ్యాను, నేను మీకు దూరమైనా మీ రూపం నాలోంచి పోలేదు శేఖర్. మీరు ఇంగ్లండు వెళ్ళిపోయారు. విధి ఎదురుతిరిగింది. నా పరిస్థితి విషమించింది.

మా అమ్మకి గుండెజబ్బు, నాన్నగారికి క్షయరోగం. నేను తెచ్చే జీతం వారి మందులకే చాలేదికాదు. యిక యిల్లెలా గడుస్తుంది. అతి కష్టంతో నెట్టుకొస్తున్నాను. ఎప్పటికప్పుడు మీ దగ్గరనుండి వచ్చే ఉత్తరాలే నాకు సంతోషాన్ని సంతృప్తిని కలిగించేవి. ఒకనాడు నాన్నగారికి ప్రమాద పరిస్థితి ఏర్పడింది. డాక్టర్ని తీసుకొచ్చి చూపించాను. ఏవో మందులు వ్రాసియిచ్చారు. యింజక్షన్సు మందులు కలిపి 50 రూపాయలదాకా అవొచ్చు. వెంటనే వాడితేగాని లాభంలేదు అన్నారు డాక్టర్.

ఎక్కడనుండి తెచ్చేది 50 రూపాయలు. నాకెవరిస్తారు! మరో పది రోజులు పోతేగాని జీతంరాదు. అయినా అభిమానం చంపుకొని అడగవలసిన చోటల్లా అడిగాను. నా దురదృష్టం నన్ను వెంటాడుతూ ఉంటే ఎవరిస్తారు డబ్బు.

చివరికి మేనేజరుగారింటి కెళ్ళాను. మొదట నన్ను చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే తేరుకొని "రా శారదా" అన్నారు.

మేనేజరు స్వభావం ఎలాంటిదో నాకు బాగా తెలుసు. భయంతోనే లోపల కడుగుపెట్టాను.

"ఏం శారదా?" అన్నారు సోఫాలో కూర్చుంటూ.

"మా నాన్నగారికి సీరియస్‌గా ఉంది. ఒక్క యాభైరూపాయలు కావాలి. జీతం రాగానే తీర్చేస్తాను" అన్నాను తల వంచుకొని.

"శారదా! నామాట వింటావా! యాభై కాదు నువ్వడిగినంత యిస్తాను" అన్నారు నావేపు చూస్తూ.

"ఏంటండీ?" అన్నాను ఆశ్చర్యంగా.

"శారదా! నాకు బోలెడంత ఆస్తి ఉంది-కానీ-నా-అనేవాళ్లెవరూ లేరు. నన్ను పెళ్ళిచేసుకో, నీ జీవితం సుఖవంతం చేసుకో" అన్నారు.

"యిదా మీరు చెప్పేది. నే నెప్పుడో యింకొకరికి మనసిచ్చాను. క్షమించండి" అని వెనక్కి తిరిగాను. అసహ్యం కోపం రెండూ కలిగాయి. ఛీ! ఆడది ఒంటరిగా కనపడితే యిదే తలంపా! ఎంత స్వార్థం, అతన్ని పెళ్లాడితే నాకు డబ్బిస్తాడా! నన్ను 50 రూపాయలకు వెలకట్టాడా! నేను అతని చేతికింద పనిచేస్తున్నదాన్ని. ఏమైనా అంటే నా ఉద్యోగం ఊడుతుంది. ఆ జీతం రాళ్ళమీద ముగ్గురి బ్రతుకులు ఆధారపడి ఉన్నాయి. ఈ ఉద్యోగం దొరకడమే బ్రహ్మాండమైంది. మౌనంగా వెనక్కి తిరిగిపోతున్న నన్ను "శారదా" అని పిలిచారు.

"శారదా! నువ్వెవర్ని ప్రేమించావో నాకు తెలుసు. మన కంపెనీ ఓనర్ సుందర్రావుగారి కొడుకు శేఖర్ని కదూ! నీఅంత అమాయకురాలింకెవరూ ఉండరు. శేఖర్ నిన్ను పెళ్లాడితే సుందర్రావుగారు ఊరుకుంటారా, వారి ఆంతస్తుకి నువ్వు సరితూగగలవా? యిది అసాధ్యం శారదా, అతని డబ్బుని చూసి నువ్వు ప్రేమించితే నీ జీవితం నువ్వే చేజేతులారా నాశనం చేసుకున్నదానివవుతావు. ఈ విషయం సుందర్రావుగారి చెవిని పడితే నీ ఉద్యోగం ఊడుతుంది. ఒకవేళ శేఖర్ నిన్ను పెళ్లాడాడే అనుకో, సుందర్రావు గారికి కోపం వస్తుంది. ఆస్తిలో చిల్లిగవ్వకూడా కొడుక్కివ్వరు. శేఖర్‌ని తండ్రికి కాకుండా చేసినదానివవుతావు. బాగా ఆలోచించుకో శారదా. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. నన్ను చేసుకొని సుఖపడు. నీ మంచికే చెప్తున్నా.

MOTORS SEI PUMPS





OUR RANGE OF PRODUCTS

- Excellant Performance.
- Low Current Consumption.
- Long Life.

- Electric Motors, Single Phase 1/4 H. P. to 2 H. P. 3 Phase 1/2 H. P. to 20 H. P.
- Centrifugal Pumps.
- Domestic Pumps.
- Monoblock Sets (3 H. P. to 10 H. P.)

*MANUFACTURERS*

SOUTHERN ENGINEERING INDUSTRIALS.

343, AVANASHI ROAD :: COIMBATORE-1.

*Branch* : 30, THAMBUCHETTY STREET, MADRAS-1.

తొందరేమీ లేదు. ఆలోచించుకొని రా. నీకు కావలసిన డబ్బు నిరభ్యంతరంగా పట్టుకెళ్లు'' అన్నారు.

నా హృదయంలో ఘర్షణ బయలుదేరింది. అతని మాటలు నాలో పెద్ద సంచలాన్ని కలుగజేశాయి. గబగబా యింటికి పరుగెత్తాను. నా గదిలోకి పోయి ఆలోచించాను. అవును మేనేజర్ మాటల్లో నిజం లేకపోలేదు శేఖర్ నాకోసం ఎంతకయినా తెగిస్తాడు. తండ్రి నెదిరించి నన్ను పెళ్ళాడితే ఆ తండ్రి హృదయం ఎంత బాధపడుతుంది. ఆ తండ్రీ కొడుకుల ఎడబాటుకి కారకురాల్నవుతాను. నేను నిరాకరిస్తే శేఖర్ కొన్నాళ్లు బాధపడతాడు. ఆ తరవాతనైనా అతని అంతస్తుకి తగినపిల్లను పెళ్ళాడి సుఖపడుతాడు. శేఖర్ సుఖంగా ఉండటమే నాకు కావాలి. ఈ విషయం సుందర్రావుగారికి తెలిస్తే నా ఉద్యోగం ఊడుతుంది. అప్పుడు నాపాట్లు కుక్కలు కూడా పడవు. మేనేజరు 30 ఏళ్ళవాడు, నేను యిరవై సంవత్సరాలదాన్ని అయితే నేం నా తల్లితండ్రులయినా సుఖపడతారు. వారి సుఖంకంటే గొప్పదా నా సుఖం. కొడుకయినా, కూతురయినా నేనే. నేను కాకుంటే ఎవరు చూస్తారు. శేఖర్! యిలాంటి పరిస్థితిలో నా స్థానంలో మీరే ఉంటే ఏంచేస్తారు? ఈ పరిస్థితులే నన్ను మేనేజర్ని పెళ్ళిచేసుకొనేలా చేశాయి.

గదిలోంచి పైకొచ్చాను.

నాన్నగారు జీవచ్ఛవంలా మంచంమీద పడున్నారు. అమ్మ ఆయనప్రక్క కూర్చొనిఉంది. పరిస్థితులు విషమించింది ఇక అక్కడ నిలవలేకపోయాను. వెంటనే—

''అమ్మా! నేను మందులు, డాక్టర్ని తీసుకొని యిప్పుడే వస్తా'' అని పరుగెత్తాను మేనేజర్ యింటికి.

''వచ్చావా శారదా: నువ్వొస్తావని నాకు తెలుసురా శారదా; యిలా కూర్చో!'' అన్నారు.

''ఏం శారదా ఏం నిశ్చయించావు?'' అన్నారు తను కూడా కూర్చుంటూ.

''అంగీకరించానండీ'' అన్నాను తల వంచుకొని.

''శభాష్ శారదా. ఈ రోజే రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం. నేను కారు తీసుకొనివస్తా రెడీగాఉండు'' అని లోనికెళ్లి నూరు రూపాయలు తెచ్చి యిచ్చారు.

''వస్తానండీ'' అని డబ్బు తీసుకొని మందులు డాక్టరుతో యిల్లు చేరుకున్నాను.

రెండు యింజక్షన్సు చేసి మందు లెలావాడాలో చెప్పి మళ్ళీ వస్తానని వెళ్ళిపోయారు డాక్టరు.

ఈ విషయం అమ్మకి చెప్పాను. చాలా బాధపడింది.

''శారదా! మాగురించి నీ సుఖం పోగొట్టుకుంటావా! మేం ఎన్నాళ్లు బ్రతుకుతాం. నువ్వు సుఖపడడమే కావాలి తల్లీ'' అని కంట తడిపెట్టుకుంది.

మేనేజరు కారులో వచ్చారు.

రిజిష్టార్ సమక్షంలో మా వివాహం జరిగిపోయింది. నాన్నగారిని ఆస్పిటల్లో చేర్పించాము. నేను, అమ్మ మేనేజర్ గారింటికి మారాము.

నాలుగు రోజులు గడిచాయో లేదో నాన్నగారు ఆస్పిటల్లో మరణించారు. ఎవరికోసం నా సుఖంవదలి ప్రేమించిన వ్యక్తిని వదులుకున్నానో ఆ నాన్నగారు నాకు కాకుండా పోయారు. ఆ దిగులుతో అమ్మ మంచం పట్టింది. ఆమె గుండెనొప్పికూడా ఎక్కువయింది.

ఆయన నన్ను ప్రేమగానే చూశారు. ఒకనాడు ''శారదా! యింతకంటె పెద్ద బంగళా ఒకటి కోపరేటివ్ కాలనీలో కొన్నాను. రెండు మూడు రోజుల్లో యిది మార్చేద్దాం'' అన్నారు. ఆయన కింతడబ్బు ఎక్కడిదో ఎప్పుడూ అడగలేదు. రెండు రోజుల్లోనే ఆ బంగళాలోకి మారాము. మరోనాడు యిరవై వేలు పెట్టి కొత్త కారు కొన్నారు. ఆ రోజు అడిగాను డబ్బెక్కడిదని.

''శారదా! సుందర్రావుగారు కంపెనీ అమ్మేశారు. నేను కొనేశాను. యిప్పుడు నేనే ఓనరని మంచి లాభాలు వస్తున్నాయి'' అన్నారు.

ఈయ నేదయినా గూడుపుఠాణీ చేశారేమోనని నా కనుమానంగానే ఉంది.

సుందర్రావుగారు అప్పులపాలైయ్యారని మునుపుండే బంగళాకూడా అమ్మేసి డాబాగార్డెన్సులో చిన్నయింట్లో ఉంటున్నారని విన్నాను.

అమ్మకి గుండెనొప్పి అధికమైంది. ఎన్నిమందు లిప్పించాలో అన్నీ యిప్పించాము. ఆస్పిటల్లో జాయిన్ చేశాము. రెండు రోజులు యమబాధపడి చివరకి అమ్మ కూడా నన్నొదిలిపోయింది.

కని పెంచిన తల్లి తండ్రు లిద్దరూ దూరమయ్యారు. నాబాధ ఎవరితో చెప్పుకోను.

ఒకనాడు ఆయన లేనప్పుడు తలుపుచప్పుడైంది.

తలుపు తీసేసరికి ఎదురుగా మీరు.

నన్నలా చూసి ఆశ్చర్యపోయారు. మీకు ద్రోహం చేశానన్నారు. మీ డబ్బును చూసి ప్రేమించానన్నారు. మీకెలా చెప్పేది శేఖర్ నాబాధ. ఆ ఆవేశంలో మీరు వింటారా! అప్పుడు మీ రూపం చూచేసరికి నాకు భయం వేసింది. మీ రెండు చేతులూ నా కంఠాన్ని చుట్టే శాయి. అలాగే మీ చేతుల్లో శాశ్వతంగా కన్ను మూసినా బాగుండేది శేఖర్. అదే సమయంలో ఆయ నొచ్చి అడ్డుకున్నారు. ఆయనతో పోట్లాడి, నాలాంటి పాపాత్మురాల్ని చంపడమే పాపం అనుకుంటూ వెళ్ళి పోయారు. మీలో అగ్ని పర్వతాలు బ్రద్ధలయ్యాయని నాకు తెలుసు శేఖర్. కేవలం డబ్బుకోసమే యిలా చేశానని అపోహపడ్డారు శేఖర్. నా ఆవేదన మీ కర్థం కాదు. నాకు సుఖంలేదు, మనశ్శాంతి లేదు. మనసొక రికి మను వొకరికి అర్పించాను. డబ్బున్నంత మాత్రాన సుఖం లభిస్తుందా! ఆయన అన్నట్లుగా పువ్వులో పెట్టి పూజించారు. కానీ శేఖర్! ప్రతీ భార్యా భర్త వద్దనుండీ పొందే సుఖం నేనెన్నడూ పొందలేదు.

నెలరోజుల క్రిందట ఆయనకు కారు ఏక్సిడెంటు జరి గింది. బలమైన గాయాలు తగిలాయని, ఆస్పిటల్‌లో ఉన్నారని, కబురొచ్చింది. ఆస్పిటల్‌కి పరుగెత్తాను.

ఆయనకు వంటినిండా కట్లే, స్పృహలేకండా పడి ఉన్నారు. ఏడుస్తూ అక్కడే కూర్చున్నాను. ఒక రోజంతా స్పృహ రాలేదు. తెలివొచ్చేసరికి "శారదా!" అన్నారు మెల్లగా.

"ఏమండీ! పెద్ద గాయాలు తగిలాయా! ఎలా జరిగింది ఈ దారుణం?" అన్నాను.

"శారదా! నేను పాపాత్ముడ్ని, నా పాపాలకు నిష్కృతి లేదు. సుందర్రావుగారి ఆస్తినంతా హస్త గతం చేసుకున్నాను. నీకు తీరని ద్రోహం చేశాను శారదా! నన్ను క్షమించు." అన్నారు నీరసంగా.

"నాకేం తక్కువైందండి యిప్పుడు మీరేమీ బాధ పడకండి" అన్నాను.

"లేదు శారదా నీకు అన్యాయం చేశాను. ఏజన్మలో చేసుకున్న పాపమో-ఈ జన్మలో ప్రతిఫలం అనుభవిస్తు న్నాను. భర్తగా నీకు దాంపత్య సుఖం ఈయలేని నిర్భా గ్యుడ్ని. శారదా!" అని కంట తడి పెట్టుకున్నారు.

"ఏమండీ! ఏమిటామాటలు మీకేంటయిందిప్పుడు" అన్నాను.

"నేను మరి బ్రతకను శారదా! నా పాపాలకు తగిన ప్రాయశ్చిత్తం జరిగింది. నేను ... నేను... నపుంసకుడ్ని శారదా!"

అంతే ఆయనకూడా నన్నొదిలి పోయారు. నేనింక ఎవరికోసం బ్రతకాలి శేఖర్? ఏం చూసుకొని బ్రత కాలి? బ్రతికి ఏం బావుకోవాలి? యిప్పటికైనా అర్థ మైందా శేఖర్ నా ఆవేదన, యిప్పుడు నన్ను క్షమించ గలరా శేఖర్. ఆయన పోయినతరువాత నాకు చెందిన పది లక్షల ఆస్తి, భవనం, కంపెనీ మీకు చెందేలా వీలు నామా వ్రాసి ఈ కవరులో ఉంచాను శేఖర్.

మీ అంతస్తుకి తగిన అమ్మాయిని పెళ్ళాడి సుఖంగా ఉండాలని మనస్ఫూర్తిగా దీవిస్తున్నా. ఈ కాగితాలు చదివి నన్ను క్షమించగలిగితే ధన్యురాల్ని శేఖర్-

ఇట్లు

శారద.

" శారదా!!! " అంటూ వీధిలోకి పరుగెత్తాడు శేఖర్.

పాపం అతనికేం తెలుసు అప్పుడే ఆమె అంతరాత్మ అనంతవాయువుల్లో కలిసిపోయిందని.

